అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
శుక్రవారం 19 మే 2023

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నవతెలంగాణ - బెజ్జూర్



మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన పొర్తేటి మహేష్(22) బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13న మండలంలోని కుకుడ, పోతపెల్లి గ్రామాల మధ్య ఆటో, మోటార్ సైకిల్ ఢీ కొట్టిన సంఘటనలో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో మహేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నెలాఖరులోగా అన్ని పనులు పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మన ఊరు మన బడి పనులు ఈ నెలాఖరు లోగా పూర్తి చేయాలని, పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మన ఊరు మన బడి పనుల పర్యవేక్షణలో భాగంగ గురువారం జిల్లా విద్యాశాఖాధికారి మావల ప్రాథమిక, ప్రాథమిక-2, ఉన్నత పాఠశాల రాంనగర్‌ను సందర్శించి మన ఊరు మన బడి పనులు పరిశీలించారు.

రైతులు గిట్టుబాటు ధర పొందాలి



నవతెలంగాణ-తాండూర్

రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో యాసంగి వరి దిగుబడులను అమ్ముకొని గిట్టుబాటు ధర పొందాలని ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్ అన్నారు. గురువారం తాండూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఏడీఏ సురేఖ మాట్లాడుతూ హార్వెస్టింగ్ సమయంలో రైతులు మట్టి పెల్లలు తాలు రాకుండా చూసుకున్నట్లయితే ఎలాంటి ఇబ్బంది లేకుండా మద్దతు ధర పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కిరణ్మయి, పిఏసిఎస్ డైరెక్టర్స్ మాసాడి తిరుపతి, పూసల రాజేశం, పులగం తిరుపతి, సర్పంచులు రమేష్, ఏవోలు ధనలక్ష్మి, పుష్పలత, సీఈఓ శ్రీనివాస్ పలువురు రైతులు పాల్గొన్నారు.

నలుగురు అనుమానితులను పట్టుకున్న గ్రామస్తులు



నవతెలంగాణ-బోథ్

మండలంలోని చింతలబోరి గ్రామంలో నలుగురు అనుమానితులను పట్టుకొని గ్రామపంచాయతీలో నిర్బంధించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం రెండు రోజుల నుండి గ్రామ శివారులో ఓమిని వ్యాన్‌లో ఇద్దరు మరో ఇద్దరు మహిళలతో గ్రామ శివారులో అనుమానంగా తిరుగుతున్నారు. గురువారం గ్రామస్తులకు వారిపై అనుమానం రావడంతో పట్టుకొని నిర్బంధించి పోలీస్‌స్టేషన్ సమాచారం అందించారు. వెంటనే పోలీసులు వచ్చి అనుమానితులను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-తాండూర్

గ్రామపంచాయతీ అధికారులు పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పెషల్ ఆఫీసర్ గజానంద్ సూచించారు. గురువారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌తో కలిసి గోపాల్ నగర్, తాండూరు పంచాయతీల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా నీరు నిలిచే ప్రదేశాలను గుర్తించి పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో మురికి కాలువను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. బోర్‌వెల్స్ దగ్గర ఉన్న ఇంకుడు గుంతల్లో కూరుకుపోయిన మట్టిని తొలగించాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ ఆరోగ్య కమిటీలను సమావేశపరిచి వర్షాకాలం సీజన్లో వచ్చే వ్యాధుల నివారణ మార్గాలను ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట గోపాల్‌నగర్ సర్పంచ్ గజ్జల బతుకమ్మ, పంచాయతీ సెక్రెటరీ వసంత, తాండూర్ పంచాయతీ సెక్రెటరీ తపస్ కుమార్ ఉన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యంగా కంటి వెలుగు



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

ప్రజల్లో అంధత్వ నివారణే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని రాజురా సర్పంచ్ చిన్న లావణ్య రవీందర్ అన్నారు. గురువారం గ్రామంలో కంటి వెలుగు శిబిరం నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ చంద్రశేఖర్, డాక్టర్ శ్రీవిద్య, సూపర్వైజర్ ప్రేమలత, ఎంపీటీసీ రాజు, హెల్త్ అసిస్టెంట్ నారాయణ, ఏఎన్ఎం జ్యోతితోపాటు ఆశా వర్కర్లు, ఉప సర్పంచ్ పద్మలింగన్న, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి రాణి, కారోబార్‌లు పాల్గొన్నారు.

ఓవర్‌మెన్, హెడ్ ఓవర్‌మెన్‌లకు వెబ్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-నస్పూర్

భూగర్భ గనుల నుండి ఉపరితల గనులకు బదిలీపై వెళ్లడానికి ఓవర్‌మెన్, హెడ్ ఓవర్‌మెన్‌లకు గురువారం వృత్తి శిక్షణ కేంద్రంలో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ వెబ్ కౌన్సెలింగ్‌లో శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాకు చెందిన 78మంది పాల్గొన్నారు. అందులో 37మంది ఉద్యోగులు ఆప్షన్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఎస్ఈ ఐఈడి కిరణ్ కుమార్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, డివైపిఎం రాజేశ్వరరావు, సీనియర్ ఐటి ప్రోగ్రామర్ శ్రీనివాస్, వృత్తి శిక్షణ కేంద్రం ఎస్ఓఎం కల్లూరి వెంకటరామారావు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు ఠాగూర్ స్టేడియం ముస్తాబు

రామకృష్ణాపూర్ : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికి తీసేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సీఎం కప్ ఆటల పోటీలకు జీఎం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఠాగూర్ స్టేడియాన్ని ముస్తాబు చేస్తున్నారు. గురువారం స్టేడియంలోని వాలీబాల్, ఖోఖో, కబడ్డీ కోర్టులను జీఎం పర్యవేక్షణలో ముస్తాబు చేశారు.

మండల జాంబవ అడహక్ కమిటీ ఎన్నిక

జన్నారం : మండల కేంద్రంలో గురువారం జాంబవ అడహక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కొండుకూరి ప్రభుదాస్, కో కన్వీనర్‌గా జంగం రవి, లింగంపల్లి రాజలింగం, కొండుకూరి రాజు, కత్తెరపాక రాజేష్, కత్తెరపాక రవీందర్, శ్రీపెల్లి జగన్, మైలారపు దుర్గేష్, జిలకర శంకర్, దుమల్ల ఎల్లయ్య, తప్పట్ల ముత్తయ్య, సాకలి దాస్, కుంటాల దుబ్బయ్య, దావుల గంగారెడ్డి, ముల్కల రమేష్ ఎన్నికయ్యారు.

సిఎం కప్ జిల్లా స్థాయి పోటీలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 22 నుండి 24 వరకు జిల్లాలో జరిగే సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయితో కలిసి సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ నెల 22 నుండి 24 వరకు జరిగే జిల్లా స్థాయి పోటీలను సంబంధిత అధికారులు సమన్వయంతో ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని తెలిపారు. పోటీలు నిర్వహించే క్రీడ విభాగాలలో ప్రతిభ గల క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఈ నెల 28 నుండి 31 వరకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 15 నుండి 36 సంవత్సరాల వయస్సు గల క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. క్రీడాకారులకు భోజన వసతి, అల్పాహారం, తాగునీరు అందించాలని, క్రీడలలో పాల్గొనే వారికి వేరుగా వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, వ్యాయామ ఉపాధ్యాయులు, ఇతర అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి



మణెమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

తప్పుడు మరణ ధృవీకరణ పత్రం గుట్టురట్టు

నవతెలంగాణ - కౌటాల



మండలంలోని గుడ్లబోరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆర్‌డీఓ గురువారం తప్పుడు ధృవీకరణ పత్రంపై విచారణ జరిపారు. గుడ్లబోరి గ్రామ పంచాయతీ పరిధిలోని వైగాం గ్రామానికి చెందిన చౌదరి నానాజీ మరణ ధృవీకరణ పత్రంపై నాలుగేండ్లుగా విచారణ సాగుతోంది. అయినప్పటికీ నాలుగేండ్ల నుండి నిజానిజాలు ఎటూ తేలలేదు. గురువారం సమగ్ర విచారణలో అప్పటి కార్యదర్శి జలేందర్ తప్పుడు మరణ ధృవీకరణ పత్రం ఇచ్చారని వ్యవసాయ శాఖ అధికారులు రైతుబీమాను నిలిపేశారు. దీనిపై నానాజీ కుటుంబసభ్యులు వ్యవసాయాధికారులపై సిర్పూర్(టి), హైకోర్టులో కేసులు వేశారు. ఈ ధృవీకరణ పత్రంపై డీఎల్‌పీఓ, రెవెన్యూ అధికారులు పలుమార్లు విచారణ జరిపి నివేదికలను ఉన్నతాధికారులకు అందించారు. వారు సైతం సమగ్ర విచారణ నివేదికలను సక్రమంగా పంపించకపోవడంతో ఇన్ని రోజుల వరకు ఆ సమస్య అలాగే ఉండిపోయింది. గురువారం ఆర్‌డీఓ రాజేశ్వర్ పలు కోణాల్లో విచారణ జరిపించారు. చౌదరి నానాజీ 16, జూలై 2018 రోజున మరణించినట్టు విచారణలో తేలింది. అప్పటికి రైతుబీమా స్కీం అమలు కాలే దు. రైతుబీమా కోసం అప్పటి కార్యదర్శి జలేందర్ తప్పుడు మరణ ధృవీకరణ పత్రాన్ని జారీ చేసినట్టు రికార్డుల ఆధారంగా గుర్తించారు. మరణ ధృవీకరణ పత్రం ఆగస్టు 17, 2018లో కుటుంబసభ్యులకు అందించారు. వారు ఆగస్టు 18న నానాజీ మరణించినట్టు దరఖాస్తు చేసుకున్నారు. 19 ఆగస్టు రోజున పంచాయతీ కార్యదర్శి జలేందర్ పంచాయతీ రికార్డులో రిజిస్ట్రేషన్ చేశారు. ఆగస్టు 19 ఆదివారం వచ్చింది. మరణ ధృవీకరణ పత్రం సెలవు రోజు అందించినట్టు రికార్డులో ఉంది. ఇది తప్పుడు మరణ ధృవీకరణ పత్రమని తేలింది. సాక్షులుగా ఉన్న బడిగె బహూజీకి చదువు రాదు. కానీ రిజిష్టర్‌లో అతను సంతకం చేసినట్టు ఉంది.

విచారణ నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్టు ఆర్‌డీఓ తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సాయన్న, ఆర్ఐ దిలీప్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ రాందాస్, కార్యదర్శి భాస్కర్, గ్రామపెద్దలు ఉన్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈ నెల 19న జరుగనున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్, 21, 22న జరుగనున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో సంబంధిత అధికారులతో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 19న జరగనున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు అలాగే మధ్యాహ్నం 2:30 నుండి 5గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష నిర్వహణకు మావల మండలంలోని నలంద డిగ్రీ కళాశాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షకు 96 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే 21, 22 తేదీల్లో నిర్వహించనున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) పరీక్షలకూ నలంద డిగ్రీ కళాశాలలోనే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, దీనికి 100 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సౌకర్యం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. సురక్షిత మంచినీరు అందజేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాంరెడ్డి, మావల తహసీల్దార్ ఇమ్రాన్, పోలీస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్



తమ నాయకుడు ఎమ్మెల్యే జోగు రామన్నపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డికి సూచించారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేణుక సిమెంటు కర్మాగారం భూముల విషయంలో సుహాసినిరెడ్డి చేస్తున్న ప్రచారాలను ఖండించారు. కేవలం ఎమ్మెల్యే కావాలనే దురుద్దేశంతోనే తమ నాయకునిపై బురదజల్లే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. యాపల్‌గూడ, రామాయి గ్రామాలలో గతంలో ఉన్న ధరలను అనుసరించే ప్రైవేట్ భూములను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. సిమెంటు పరిశ్రమతో పాటు ఆసుపత్రిని కూడా ఏర్పాటు చేయాలని సంకల్పంతో తమ నాయకుడు ముందుకెళ్తుంటే రాజకీయ లబ్ధి కోసం కొంతమందితో దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. వాస్తవాల కోసం బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. రాబోయే ఎన్నికల్లో బిజెపికి ఐదు సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. అంతకుమించి సీట్లు వస్తే తన డిసిసిబి పదవికి రాజీనామా చేస్తానని పేర్కొన్నారు. దేవుళ్లను అడ్డుపెట్టుకొని తాము రాజకీయాలు చేయబోమని చిత్తశుద్ధితో వందకుపైగా దేవాలయాలకు షెడ్లు నిర్మించామని చెప్పుకొచ్చారు. తమ నాయకునిపై ప్రజలకు గల నమ్మకంతోనే నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కూడా అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మహిళగా తనను గౌరవిస్తున్నామని, తమ నాయకుని జోలికి వస్తే ఇకపై సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు అలాల్ అజయ్, సలీం పాషా పాల్గొన్నారు.



కొనసాగిన అన్నదానం

నవతెలంగాణ- భీమిని

పోతురాజుల వశిష్ట్ సౌజన్యంతో మండల కేంద్రంలో ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి లక్ష్మణ్, శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో ఎప్పటిలాగే గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ రోజుతో 47వ వారానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో శ్రీరామ సేవా సమితి అధ్యక్షులు పోతురాజుల లక్ష్మణ్, పోతురాజుల తిరుపతి, సతీష్, ఇగురపు నవీన్, గంగిశెట్టి ప్రసాద్, ప్రవీణ్, కొరాల రమేష్ పాల్గొన్నారు.

ఆదిమ గిరిజన జాతుల అభివృద్ధికి కృషి

- ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిమ గిరిజన తెగ కొలాంల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండలంలోని సాలెగూడ గ్రామంలో కొలాం జన జాగృతి సమ్మేళనంలో పీఓ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పీఓ రాకతో కొలాం సంఘ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ కొలాం ప్రజల అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా చేయూతనిస్తామన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరు చదువుకోవాలని సూచించారు. ఉన్నత చదువుల కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో తగు కృషి చేస్తామన్నారు. విద్య, ఉపాధి రంగాల్లో కొలాం విద్యార్థులు రాణించాలని, దానికనుగుణంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొలాం ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొలాం రైతులకు గిరి వికాసం కింద లబ్ధి చేకూర్చాలని, ముఖ్యమైన దేవస్థానాల ఆలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని, సీసీడీపీ నిధుల కింద ఇండ్లు నిర్మించాలని, కొలాం గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం, నిరుద్యోగ యువతకు పారిశ్రామికంగా శిక్షణ ఇచ్చి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని కోరారు.

32రోజులుగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం



నవతెలంగాణ-ఉట్నూర్

ఐకేపీలలో విధులు నిర్వహిస్తున్న వీఓఏల సమస్యలను పరిష్కరించాలని 32రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయు నాయకుడు చిన్నయ్య అన్నారు. సీఐటీయు ఆధ్వర్యంలో మండుటెండలో ఐకేపీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడి అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పథకాలు మహిళ సంఘాల సభ్యులకు చేర్చేందుకు కీలక పాత్ర పోషిస్తున్న వీఓఏలకు కనీస వేతనం, గుర్తింపు, బీమా పాలసీ లేదని తెలిపారు. ఇటీవల ఐకేపీలోని ఉద్యోగులందరిని సెర్ప్ ఉద్యోగులుగా ప్రకటించారని, వీరిని సైతం సెర్ప్ ఉద్యోగులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వీఓఏలందరికి కనీస వేతనం రూ.26వేలు అందించి, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగలు అరెస్ట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కోర్టు ప్రాపర్టీ గది నుండి కాపర్ వైర్ దొంగిలించిన కేసును పోలీసులు త్వరగానే ఛేదించారు. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ ఉమేందర్ గురువారం వెల్లడించారు. కోర్టులో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసే షేక్ షబ్బీర్ ఇప్ప పరమేశ్వర్‌తో కలిసి సుమారు 258 కిలోల కాపర్ వైర్‌ను మే 4న రాత్రి ప్రాపర్టీ రూమ్ నుండి చోరీ చేసి స్క్రాప్ దుకాణ యజమాని రఫిక్‌కు విక్రయించారు. అనంతరం రూ.30వేలు షేక్ షబ్బీర్‌కు ఇచ్చారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఈ కేసుకు సంబంధం ఉన్న అందరినీ రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ తెలిపారు. మీడియా సమావేశంలో సీఐ పురుషోత్తం, ఎస్ఐలు విష్ణుప్రకాష్, ఊశన్న, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన కిరణ్‌కు తపస్ సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సత్యసాయి యూనివర్సిటీ నుండి ఎడ్యుకేషన్ విభాగంలో ఏసేక్టీవ్ ప్రాక్టికల్ అప్రోచెస్ ఫర్ చైల్డ్ వుడ్ ఎడ్యుకేషన్ అంశంపై డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో గురువారం మాధవ నిలయంలో ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రొఫెసర్ సల్లా విజయ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో ఎంతోమంది ఛాత్రోపాధ్యాయులని ప్రభుత్వ ఉపాధ్యాయులు తీర్చిదిద్దిన కిరణ్‌కు డాక్టరేట్ లభించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని, భవిష్యత్‌లో కూడా ఇలాగే సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వలబోజు గోపికృష్ణ, సహ అధ్యక్షులు అల్లూరి మనోజ్‌రెడ్డి, కొమురం యాదవ్‌రావు, ఉపాధ్యక్షులు మెట్పల్లి గోపాలకృష్ణ, సింగిడి వెంకట్రాంరెడ్డి, మెస్రం రాజ్‌కుమార్, బోయర్ రాజశేఖర్, గంగయ్య పాల్గొన్నారు.

హెచ్ఐవీ, టీబీ, ఎస్‌టీఐలపై అవగాహన

నవతెలంగాణ-కడెం

చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో అంబారిపేట్ గ్రామంలో స్టాల్ వేసి హెచ్ఐవీ, టీబీ, ఎస్‌టీఐలపై గ్రామప్రజలకు అవగాహన కల్పించారు. ఈ వ్యాధుల పట్ల ప్రజలకు పలు సూచనలు చేశారు. రక్త పరీక్షలలో అంబారిపేట్ ప్రజలు అధిక మొత్తంలో పాల్గొన్నారని అన్నారు, ఎఆర్‌టీ సేవలు ప్రభుత్వం ఉచింతంగా కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొప్పుల లక్ష్మి లచ్చన్న, కడెం పోలీస్ సిబ్బంది, ఎల్‌డబ్ల్యూఎస్ సూపర్‌వైజర్స్ రాకేష్, శశిమాల, లింక్ వర్కర్స్ మంజుల, స్వప్న, రోజా పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని మల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా సోన్ జట్టు నిలిచింది. స్థానిక మల్లాపూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇరు జట్లకు మండల ఇన్‌చార్జీలు అల్లోల సురేందర్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్‌రెడ్డిలు బహుమతులు ప్రదానం చేశారు. యువత క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో మాజీ కేశం లక్ష్మి రమేష్, ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.



కబళిస్తున్న క్యాన్సర్ వ్యాధి..అప్పుల పాలై రోడ్డున పడ్డ కుటుంబం

- అపన్న హస్తం కోసం ఎదురుచూపులు



నవతెలంగాణ-ఖానాపూర్

అనారోగ్య సమస్యలు కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. అనారోగ్యంగా ఉందని ప్రయివేటు ఆస్పత్రికి వెళ్తే క్యాన్సర్ వ్యాధి అని నిర్ధారణ కావడంతో కుటుంబ సభ్యులు నిర్ఘాంత పోయారు. వైద్య ఖర్చుల నిమిత్తం దాదాపు రూ.10లక్షలు ఖర్చు చేసిన నయం కాకపోవడంతో ఓ కుటుంబం అప్పుల పాలై రోడ్డున పడింది. ఖానాపూర్ మండలంలోని గోసంపల్లి గ్రామానికి చెందిన కడమంచి రాజేష్ అనే యువకుడు గత ఆరు నెలల నుండి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో వైద్యం కొరకు ఇప్పటివరకు రూ.10 లక్షలు అప్పు చేసుకుని వైద్య ఖర్చులు చేసిన పరిస్థితి మాత్రం మారలేదని వాపోయారు. ఇప్పుడు ఇంకా రూ.6లక్షలు అయితేనే బ్రతకడానికి అవకాశం ఉందని డాక్టర్లు చెప్పున్నారనీ, కానీ తమ వద్ద తమ వద్ద చిల్లీ గవ్వ కూడా లేదనీ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నాడని తెలిపారు. వైద్య ఖర్చులకోసం ఉన్న గుడిసెను, ఇంటిస్థలం సైతం అమ్ముకున్నామని అన్నారు. తినడానికి తిండి లేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం నుండి తమకు ఆర్థిక సాయం అందేలా స్థానిక ప్రజాప్రతినిధులు చూడాలని వేడుకున్నారు. సాయం చేయదలచిన వారు ఈ నెంబరు 9959381097 ఫోన్ పే కానీ, గూగుల్ పే చేయాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆదిలాబాద్అర్బన్

నవతెలంగాణ-ఆదిలాబాద్అర్బన్

ఐకేపీ, వీఓఏలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ తెలంగాణ ఐకేపీ, వీఓఏ ఉద్యోగుల సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ ఆర్డీఓ రమేష్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, వీఓఏ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కనుకుంట్ల రాజేష్, దత్తు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో గ్రామస్థాయిలో 18 వేల మంది వీఓఏలు గ్రామ సంఘ సహాయకులుగా పనిచేస్తున్నారని అన్నారు. 20 సంవత్సరాలుగా గ్రామంలోని మహిళల అభ్యున్నతికి వారి స్వయం సహాయక అభివృద్ధికి తాము ఎంతగానో కృషి చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సంక్షేమ పథకాలను విజయవంతంగా నిర్వహిస్తున్న తమకు కేవలం రూ. 3 వేల 900లు కనీస వేతనంగా చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత ఏప్రిల్ మూడవ తేదీ నుంచి సమ్మె చేపట్టిన అనేక పర్యాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేత...

సిరికొండ : తమ సమస్యలను పరిష్కరించాలని గత 32 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, దీనికి నిరసన తెలుపుతూ గురువారం మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి మండల వీఓఏలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీఓఏల మండల అధ్యక్షుడు బొడ్డు దత్తాత్రి మాట్లాడుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, రూ.26 వేల గౌరవ వేతనాన్ని ఇవ్వాలని అన్నారు. వీఓఏలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు. మహిళా సంఘం సభ్యులు ఇంతకు ముందు కట్టినటువంటి అభయ హస్తం డబ్బులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రీనిధి బ్యాంకు లోన్‌లకు నాలుగు సంవత్సరాల నుంచి రావాల్సిన ప్రభుత్వ బకాయి వడ్డీని మహిళలకు తిరిగి ఇవ్వాలని అన్నారు. మహిళ సంఘ సభ్యులకు కూడా ఇన్సూరెన్స్ కల్పించాలని అన్నారు. గతంలో లాగా సంఘ సభ్యుల పిల్లలకు స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పించాలని అన్నారు. వీఓఏలు శాంతియుతంగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు మంజుల, గోదావరి, కొత్మ బాయి, రాజు, కిషోర్, జగదీష్ పాల్గొన్నారు.


సిరికొండలో...

కడెం ప్రాజెక్టును సందర్శించిన జిల్లా కలెక్టర్



నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టును గురువారం జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వరద గేట్లు, గేజ్ రూమ్ తదితర వాటిని పరిశీలించి, ప్రాజెక్ట్ అధికారులతో మాట్లాడారు. ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం, ఇన్ ఫ్లో అవుట్ ఫ్లో, డెడ్ స్టోరేజ్ ప్రాజెక్టు మరమ్మతుల పనులకు సంబంధించి వివరాలను ఆరా తీశారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా మరమ్మతు పనులను వేగవంతంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన నాయకులు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలకేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను గురువారం బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఠాకూర్ అర్జున్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంలో అంతా డొల్లతనమే కనిపిస్తుందని అన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇండ్ల నిర్మాణం చేపట్టడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణానికి వాడుతున్న ఇటుకలు, సిమెంటు, ఇనుము తదితర వస్తువులన్నీ కూడా నాసిరకమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్ల నిర్మాణం పూర్తయ్యాక అవి ఎంతో కాలం మునగడలో ఉండవని అన్నారు. అతి తక్కువ కాలంలోనే శిథిలావస్థకు చేరుతాయని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఆగమేఘాల మీద డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మిస్తున్నారని ఏండ్లు గడిచిన అర్హులకు ఇల్లు అందించడం లేదని ఎద్దేవ చేశారు. వీరి వెంట దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బరుకుంట నరేందర్, ఉపాధ్యక్షులు సవీన్, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు సుంకరి మహేష్, వార్డు సభ్యులు సాయి కృష్ణ, లక్ష్మణ్, మహేష్, రాజు, సాయిలు ఉన్నారు.

వరి కొనుగోలు కేంద్రాల్లోని దోపిడీని అరికట్టాలి



నవతెలంగాణ-కడెం

మండలంలోని వరి కొనుగోలు కేంద్రాల్లో జరిగే దోపిడీని అరికట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ సభ్యులు గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా కమిటి సభ్యులు సునారికారి రాజేష్ మాట్లాడుతూ వరి కొనుగోలు సెంటర్‌లో 40 కిలోల బ్యాగులో 42 కిలోలు కంట చేస్తూ ఒక క్వింటాలుకు 3 నుండి 5కిలోలు ఆదనంగా కాంట చేస్తున్నారని అన్నారు. కష్ట పడి పంటలు పండించి చివరికి కొనుగోలు సెంటర్లకు వడ్లు తీసుకువస్తే సెంటర్లలో అనేక కారణాలు చెపుతూ నిలువున రైతులను దోపిడీ చేస్తున్నారని అన్నారు. ఈ దోపిడిని అరికట్టాల్సిన అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అధికారులు పర్యవేక్షణ లేదు అని పేర్కొన్నారు. అధికారులు రైతాంగానికి అవగాహన కల్పించడంలో విఫలమైయ్యరని అన్నారు. వెంటనే జిల్లా అధికార యంత్రాంగం అన్ని సెంటర్‌లో తనిఖీలు నిర్వహించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య విలాస్ నాయక్, బి.సంతోష్ పాల్గొన్నారు.

పశు వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కడెం

మండలంలోని పెద్దూర్ తాండ గ్రామంలోని కడెం పశు వైద్యశాల డాక్టర్ విజయకుమార్ నిర్లక్ష్యంగా వహిస్తు, వైద్యం అందించకపోవడం వల్లే తమ రెండు మాసాల ఆవుదూడ మృతి చెందిందని గురువారం పెద్దూర్ జీపీ 11వ వార్డు సభ్యులు లావుడియా గంగన్న ఆరోపించారు. పశువైద్యాధికారి డాక్టర్ విజయకుమార్ ఆస్పత్రిలో అందుబాటులో ఉండి పశువులకు వైద్య చికిత్స అందించడం లేదని అన్నారు. గత 15 రోజుల నుండి తమ ఆవుదూడకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో పశు వైద్యాధికారి డాక్టర్‌కు పెద్దూరు తాండకు వచ్చి ఆవుదుడకు వైద్య చికిత్సలు చేయాలని విన్నవించామని అన్నారు. కడెం పశు వైద్యశాలకు ఆవు దూడను తీసుకువస్తే వైద్య చికిత్సలు చేస్తామని చెప్పిన డాక్టర్ ఆస్పత్రికి ఆవుదూడకు తీసుకువచ్చిన ఆస్పత్రిలో అందుబాటులో ఉండటం లేదని అన్నారు. గత 15 రోజుల నుండి ఆవుదూడకు వైద్యం అందక గురువారం ఆవుదూడ మృతి చెందిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పశువైద్యశాలలో విధులు సక్రమంగా నిర్వర్తించకుండా పశువులకు వైద్యం అందించకుండా ఆవు, దూడ మృతికి కారణమైన డాక్టర్ విజయకుమార్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు లావుడియా గంగన్న, జిల్లా కలెక్టర్, జిల్లా పశుసంవర్ధక అధికారిని కోరారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని చామన్‌పల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులు రూ.2లక్షలతో నిర్మించ తలపెట్టిన నూతన రోడ్డు నిర్మాణానికి గురువారం సర్పంచ్ పడిగెల గంగాధర్ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి హాజరయ్యారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వర్ష కాలంలో ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నూతన రోడ్డు నిర్మాణనికి ముందుకొచ్చిన సర్పంచ్ పడిగెల గంగాధర్‌ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సురేష్, శ్రీనివాస్, రాజేందర్, మధు, రమణ, మహిపాల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

- గంటన్నరలో ముగింపు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రజా సంక్షేమ పథకాల అమలు, సాధించిన ప్రగతి, చేపట్టాల్సిన పనులు తదితర అంశాలపై ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాల్లో జవాబుదారీతనం కొరవడుతున్నది. ప్రజా సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపకుండా తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో గ్రామాల్లోని సమస్యలు, అభివృద్ధిపై చర్చించేందుకు అవకాశమున్నా తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. మండల సర్వసభ్య సమావేశాలకు అన్ని శాఖల అ ధికారులు పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాల్సి ఉండగా, పలు శాఖల అధికారులు కిందిస్థాయి సిబ్బందిని సమావేశానికి పంపించి అయ్యిందనిపిస్తున్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ పోటే శోభాబాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలుశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభ్యులు ఎవరూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకురాలేదు. దీంతో సమావేశం గంటన్నరలో ముగిసింది.

ఇకపై ప్రజల వద్దకే పుర ప్రజావాణి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణ పౌరుల సమస్యలను పరిష్కరించడం కోసం ప్రవేశపెట్టిన పుర ప్రజావాణి కార్యక్రమం ఇకపై పట్టణంలోని వివిధ వార్డులలో కొనసాగనుందని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. గురువారం స్థానిక కైలాస్ నగర్‌లో ఏర్పాటు చేసిన పుర ప్రజావాణి కార్యక్రమంలో అధికారులతో కలిసి పాల్గొన్నారు. ప్రజల సమయాన్ని దృష్టిలో ఉంచుకొని సత్వర పరిష్కారం కోసమే సదరు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పురప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వార్డుల్లో నెలకొన్న ప్రతి సమస్యను ప్రజావాణి దృష్టికి తీసుకువచ్చి, సత్వర పరిష్కారం పొందాలని సూచించారు. త్వరలో ఎమ్మెల్యే జోగు రామన్న కృషితో పట్టణ అభివృద్ధికి మరిన్ని నిధులు సమకూర్చుకొని కైలాష్ నగర్‌లో ప్రధాన రహదారులు, నాలాల ఏర్పాటుకు మరో రూ.90లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ కమిషనర్ శైలజ, వార్డ్ కౌన్సిలర్ అర్చన, ఈఈ తిరుపతి, ఎస్సై నరేందర్, నాయకులు బోయిన్‌వార్ గంగారెడ్డి, దుర్గం శేఖర్, రామ్ కుమార్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని రాష్ట్ర ప్రభుత్వం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామిలను నెరవేర్చడంలో విఫలమయ్యారని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని వివిధ గ్రామాలను నుంచి ఆదివాసులు తరలివచ్చి కంది శ్రీనివాస్‌ను కలిశారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన వివరించారు. ఆదిలాబాద్ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. అనంతరం ఆదివాసులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ చైర్మెన్ సెడ్మాకి ఆనంద్‌రావు, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్ర జ్ఞానేశ్వర్, చంటి, నాగర్కర్ శంకర్ పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాన్పు కాన్పుకు మధ్య వ్యవధికి జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-తాంసి

కాన్పు కాన్పుకు మధ్య వ్యవధికి పలు జాగ్రత్తలు తీసుకొని, తల్లి పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ రాజ్ గర్భిణులకు, బాలింతలకు సూచించారు. గురువారం భీంపూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గిరిగాం గ్రామ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలలో ఉన్న 27 గర్భిణీ స్త్రీలకు రక్తపరీక్షలు చేసి, ఆరోగ్య కేంద్రంలో సలహాలు, సూచనలు, మందుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ సంపూర్ణ పోషకాహారం ప్రాధాన్యత కాన్పుల, కాన్పుల మధ్య వ్యవధి కోసం తాత్కాలిక పద్ధతులైన నిరోధ్, ఓరల్ పిల్స్, అంతర ఇంజెక్షన్, పీపీఐయూసీడీ గాని ఉపయోగించుకోవాలని అన్నారు. తద్వారా తల్లి పిల్లల ఆరోగ్యం మెరుగుపడి, ఆరోగ్యంగా, మానసికంగా, ఆర్థిక పరంగా ఎదుగుదలకు తోడ్పడుతుందని అన్నారు కుటుంబ సంక్షేమ కార్యక్రమంలో ఈ విధంగా మాతాశిశు సంరక్షణ చేయడం జరిగుతుందని అన్నారు. మన ఉపకేంద్రాల సిబ్బందితో సకాల పరీక్షలు, ఆరోగ్యసలహాలు, వారు తెలిపిన ఆరోగ్య అవగాహనను పాటించాలని అన్నారు. అనుబంధ పోషకాహారాన్ని సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్తల నుండి తీసుకోవాలని అన్నారు. న్యూట్రీషన్ల కిట్స్, 6-గర్భిణీ స్త్రీలకు అందిస్తామని అన్నారు. సురక్షిత కాన్పు కోసం మా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భీంపూర్ సేవలను ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రమాద భరితలక్షణాల గల 7-గర్భిణీ స్త్రీలను రిమ్స్‌కు పరీక్షలు, చికిత్సల కోసం పంపడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు కె.లూసి, బి.గంగాధర్, స్టాఫ్ నర్స్ ప్రియాంక, అనసూయ, ఆరోగ్య కార్యకర్త యన్.సరస్వతి, ఫార్మాసిస్ట్ అశోక్‌రెడ్డి, ఆశాకార్యకర్తలు సిబ్బంది రేఖ, శంకర్, శివాజి, రాందాస్ పాల్గొన్నారు.

వర్షాలకు ముందే మరమ్మతు పనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని ప్రాజెక్టులకు సంబంధించి మరమ్మతు పనులను వర్షాలకు ముందే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సదర్మాట్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడారు. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం, ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో, డెడ్ స్టోరేజి గురించి, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

భర్తను మద్యం మాన్పించలేక భార్య ఆత్మహత్య

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన వెయిగండ్ల నిత్య(27) జీవితంపై విరక్తి చెంది గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని జన్నారం ఎస్సై సతీష్ తెలిపారు. స్థానిక ఎస్సై పి.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గత 8 సంవత్సరాల క్రితం రేండ్లగూడ గ్రామానికి చెందిన వెయిగండ్ల మహేందర్‌తో వివాహం కాగా మహేందర్ ఏ పనిచేయకుండా మద్యం తాగుతూ జులాయిగా తిరిగే వాడు. భార్య ఎంత చెప్పినా తాగుడు మానక పోవటంతో మనస్థాపం చెంది జీవితంపై విరక్తితో ఇంటి ముందు ఉన్న పందిరికి చీరతో ఉరివేసుని ఆత్మ హత్య చేసుకుంది. మృతురాలి తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. మృతురాలికి 5 సంవత్సరాల కూతురు అరణ్య, 3 సంత్సరాల కొడుకు కన్నయ్య ఉన్నారు.

సింగరేణి పాఠశాల విద్యార్థులకు అభినందన

నవతెలంగాణ-నస్పూర్

పదవ తరగతిలో 2022-23 సంవత్సరానికి గాను సింగరేణి పాఠశాలలో అత్యధిక గ్రేడ్ పాయింట్లు వచ్చిన విద్యార్థినీ, విద్యార్థులను(యామిని 9.2, రోహిత్ 9.0, రాము 9.0, వంశీ 9.0)లను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ పదవ తరగతిలో అత్యధిక గ్రేడ్ పాయింట్లు తెచ్చుకున్న విద్యార్థిని, విద్యార్థులు పై చదువులలో అత్యధిక మార్కులు సాధించాలని, తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షులు అబ్దుల్ ఖాదీర్, డీజీఎం పర్సనల్ పి.అరవింద రావు, పర్సనల్ మేనేజర్, కరస్పాండెంట్ రాజేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య పాల్గొన్నారు.

'రక్తదానం చేసిన వారు ప్రాణ దాతలవుతారు'



నవతెలంగాణ-నస్పూర్

రక్తదానం చేసిన వారు ప్రాణదానం చేసనవారవుతారని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి అన్నారు. గురువారం ఆర్కే-8 డిస్పెన్సరీలో వృత్తి శిక్షణా కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న ఉద్యోగులకు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదానం చేసిన 19మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ అన్ని దానాలకన్నా రక్తదానం గొప్పదని, సంస్థ యువ కిరణాలతో కళకళలాడు తుందని, రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఈ సంవత్సరం 16 రక్తదాన శిబిరాలు నిర్వహించారని ఈ రక్తదాన శిబిరాల ద్వారా 676 యూనిట్ల రక్తం రెడ్ క్రాస్ సొసైటీ వారికి అందజేయడం జరిగిందని తెలిపారు. ఇలా సేకరించిన రక్తాన్ని తలసేమియా వ్యాధిగ్రస్థులకు, కిడ్నీ వ్యాధిగ్రస్థులకు, కాన్సర్ వ్యాధిగ్రస్థులకు, గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వ హాస్పిటల్ లోని నిరుపేదలకు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. కంపెనీ ఉత్పత్తితో పాటు సామాజిక సేవలో కూడా ముందుంటుందని అన్నారు. అలాగే రెడ్ క్రాస్ సొసైటీ వారు చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డివై జీఎం(ఎస్ఎంఎస్) ఎంవీటీసీ రాజేంద్రప్రసాద్, డివై సీఎంఓ డాక్టర్ పి.రమేష్ బాబు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి, వృత్తి శిక్షణ కేంద్రం శిక్షకులు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో

తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సిబ్బందిచే రక్తదానం చేయించారు. ఈ రక్తదాన శిబిరంలో వివిధ వర్గాలకు చెందిన 60 మంది రక్త దానం చేశారు. రక్తదానం చేసిన వారిని అభినందించి వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ దాసరి వేణు, మండల తహసీల్దార్ జ్యోతి, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ పాల్గొన్నారు.

తూకం వేసిన ధాన్యాన్ని త్వరగా గోదాములకు తరలించాలి



నవతెలంగాణ-జన్నారం

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని త్వరగా గోదాములకు తరలించాలని మంచిర్యాల ఆర్డీఓ వేణు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున ధాన్యం తూకంలో వేగవంతం పెంచాలన్నారు. తూకం వేసిన వరి ధాన్యాన్ని త్వరగా సమీప గోదాములకు తరలించాలని సూచించారు. ఆర్డిఓ వేణుతో జన్నారం తహసీల్దార్ ఇట్యాల కిషన్, ఆర్ఐ భానుచందర్ ఉన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు : రమేష్‌కుమార్



నవతెలంగాణ-జన్నారం

గ్రామాల్లో పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మండల స్పెషల్ ఆఫీసర్ రమేష్ కుమార్ అన్నారు. గురువారం పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీ పరిధిలో పలు వాడలలో ఆయన పర్యటించి మురుగునీటి కాలువలను పరిశీలించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్లపై చెత్త లేకుండా చూడాలన్నారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. రోడ్డు పక్కనే ఉన్న కిరాణా షాపుల వద్ద చెత్త ఉండడాన్ని చూసి కిరాణా షాప్ యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ రాణి, పొన్కల్ ఈఓ మహేష్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశానికి ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పదో తరగతి ఉత్తీర్ణులై ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు ఐటీఐ తెలంగాణ జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నిజ ధ్రువపత్రాలను అప్లోడ్ చేసి జూన్ 10లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. పూర్తి వివరాల కోసం స్థానిక ఐటీఐ కళాశాల కార్యాలయాల్లో సంపాదించాలన్నారు.

భూపంపిణీపై

సమగ్ర దర్యాప్తు జరపాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యులు పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారు సర్వే నెం.8లో గల ప్రభుత్వ భూపంపిణీ తీరుపై ప్రభుత్వం సమగ్రమైన దర్యాప్తు జరుపాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యులు పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) నాయకులు సంకె రవి, దాసరి రాజేశ్వరి, గోమాస ప్రకాష్, కనికరపు అశోక్, ఎర్మ పున్నం, బోడంకి చందు, దుంపల రంజిత్ కుమార్‌తో కలిసి గురువారం బావురావుపేట్ భూపోరాట కేంద్రాన్ని సంధర్శించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ దాదాపుగా 40 సంవత్సరాల క్రితం పంపిణీ చేసిన బావురావుపేట్ శివారు ప్రభుత్వ భూమిలో లబ్దిదారులు ఎవ్వరు ఇండ్లు కట్టుకోక పోగా పంటలు సాగు చేసిన ధాఖాలు లేవు.. పడావుగా పడివున్న ప్రభుత్వ భూమిని ఇండ్ల స్థలాల కోసం కెటాయించాలని కోరుతున్న నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు చేపట్టిన న్యాయమైన పోరాటం పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాల కోసం పోరాడుతున్న మహిళలను బెదిరింపులకు గురి చేయడం, అక్రమంగా కేసులు నమోదు చేయిస్తుండగా ఈ ప్రభుత్వ భూమి ద్వార లబ్ధిపొందాలని చూస్తున్న మరికొందరు రాత్రికి రాత్రి ట్రాక్టర్లతో దున్నించడం ధుశ్చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన లబ్దిదారులకు బదులుగా ఇతరులు తమ పేరుతో ధరణీ రికార్డుల్లోకి చొరబడి పేదలకు చెందాల్సిన భూమిని కాజేసి సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. పేదలకు పంపిణీ చేసిన భూమి అమ్మడం, కొనడం చేయరాదని చట్టం చెపుతున్నా.. ఇవేమి పట్టకుండా దర్జాగా లోపాయికారి ఒప్పందాలతో భూములను ప్రభుత్వ భూములను ప్లాట్లుగా మార్చి వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ పెద్దలు ఏ మాత్రం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమార్కుల నుంచి ఇక్కడి ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇక్కడి భూమిని ఇండ్ల స్థలాల కోసం కెటాయించాలని డిమాండ్ చేస్తున్న పేద కుటుంబాల వారి అభ్యర్థన మేరకు భూములు పంపిణీ చేయాలని కోరారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత



నవతెలంగాణ-నస్పూర్

కారుణ్య నియామకాలలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో నూతనంగా నియమితులైన 32 మంది యువతీ-యువకులకు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి గురువారం వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ కారుణ్య నియామకాలు చేపడుతూ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందని, దక్షిణ భారతదేశంలోనే సింగరేణి సంస్థ దేశానికే తలమానికంగా ఉందని అన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ఉద్యోగులు సర్ఫేస్‌లో లైట్ జాబ్ కోసం ప్రయత్నం చేయకుండా, గైర్హాజరు కాకుండా ఉద్యోగం చేసుకోవాలని అన్నారు. అలాగే తమ తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ, క్రమశిక్షణతో ఉద్యోగం చేసుకోవాలని, సింగరేణిని లాభాల బాటలో తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రగతిపథంలో వెళ్తుందని దానికి అనుగుణంగా ప్రతి ఒక్క ఉద్యోగి రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించడానికి కృషి చేయాలని చెప్పారు. ఉద్యోగంలో నైపుణ్యాన్ని పొంది ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సీనియర్ ఉద్యోగుల సలహాలు సూచనలు తీసుకుని ప్రమాద రహిత సింగరేణిగా చేయాలని కోరారు. ఇప్పటివరకు శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో 3274 కారుణ్య నియామక పత్రాలను జారీ చేయడం జరిగిందని, సింగరేణి వ్యాప్తంగా 11052 కారుణ్య నియామక పత్రాలు జారీ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షులు అబ్దుల్ ఖాదీర్, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సీనియర్ పిఓ కాంతారావు, మాటేటి వెంకట రాజయ్య పాల్గొన్నారు.

మందమర్రి : మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెడికల్ ఇన్ వాలిడేషన్ డిపెండెంట్లు 10 మందికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.మోహన్ రెడ్డి చేతుల మీదుగా కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఏరియాలో ఇప్పటివరకు కారుణ్య నియామకాల ద్వారా 1555 మందికి ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఏ.రాజేశ్వర్‌రెడ్డి, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ ఎస్.సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డీవైపీఎం సత్య బోస్ పాల్గొన్నారు.

'వరిసాగులో తడి-పొడి పద్ధతి లాభదాయకం'



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

వరిసాగులో తడి పొడి పద్ధతి లాభదాయకమని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. వంజీరి రైతు వేదికలో గురువారం కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్, రూరల్ అవేర్నెస్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో తడి పొడి పద్ధతిలో వరిసాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. వ్యవసాయంలో నీటిసామర్థ్యం యాజమాన్య పద్ధతులను పాటించడం ఎంతో ఆవశ్యకమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా యాభై శాతం కంటే ఎక్కువ జనాభా ప్రధాన ఆహారంగా వాడే పంట వరి పండించటానికే ఎక్కువ మోతాదులో నీరు అవసరమవుతుందన్నారు. సంప్రదాయ పద్ధతిలో కిలో బియ్యం ఉత్పత్తి చేయడానికి 3000 నుండి 5000 లీటర్ల నీరు అవసరమని, ఇది ఇతర ఆహార ధాన్యాల ఉత్పత్తికి అయ్యే నీటి వినియోగం కంటే 2, 3 రెట్లు అధికం అన్నారు. తక్కువ నీటితో ఎక్కువ ఉత్పాదకత సాధించడానికి తడి పొడి పద్ధతిలో వరిసాగు దోహదపడుతుందని సూచించారు. సీసీఎక్స్ కన్సల్టెంట్ డాక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ తక్కువ నీటి వినియోగంలో దిగుబడులు తగ్గకుండా వరిని పండించడానికి వాతావరణ పరిరక్షణకు కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్ ఆధ్వర్యంలో తడి-పొడి సాగు నీటి యాజమాన్యం పద్ధతులు అవలంభించాలన్నారు. క్రమంగా నీరు పెట్టడం, ఆర బెట్టడం వంటి పద్ధతులను అవలంభించటంతో 15-30 శాతం నీటి వినియోగం తగ్గుతుందన్నారు. ఈ విధానంలో వరిసాగు చేయటం వల్ల వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెంది చేను క్రింద పడిపోదని, చీడ పీడలు ముఖ్యంగా దోమ కాటు ఉధృతి తక్కువగా ఉంటుందన్నారు. రైతులందరూ తడి పొడి పద్ధతిలో వరిసాగు చేసి లాభాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు మిలింద్ కుమార్, రాజుల నాయుడు, ఏఓలు రామక్రిష్ణ, మంజుల, ఖాధర్ హుస్సేన్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో పల్లెపల్లెకు పాల్వాయి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

బీజేపీ తాలుకా నాయకులు పాల్వాయి హరీష్ చేపడుతున్న పల్లె పల్లెకు పాల్వాయి, గడప గడపకు బీజేపీ కార్యక్రమం గురువారం కాగజ్‌నగర్ మండలంలో ప్రారంభమైంది. మండలంలోని పాత సార్సాల, కొత్త సార్సాల, గెర్రెగూడెం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హరీష్ మాట్లాడుతూ దళిత బంధు పథకాన్ని రూ.3 లక్షలకు అమ్ముకున్న బీఆర్ఎస్ నాయకులు దళితులకు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 5 గురు ఎమ్మెల్యేలు దళిత బంధు పథకాన్ని లబ్దిదారులకు రూ.మూడు లక్షల కమిషన్ పుచ్చుకొని అమ్ముకున్నారని సాక్షాత్తు ముఖ్యమంత్రి కేసీఆరే అనడం ఎమ్మెల్యేలకు సిగ్గుచేటన్నారు. దళిత బస్తీ కింద మూడెకరాల భూమి ఇస్తామని, దళితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పిన నాయకులు ఇప్పుడు ముఖం ఎందుకు చాటేసారో చెప్పాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పుల్ల అశోక్, రత్నం సంతోష్, ధాగమ రాజు, రత్నం సంజీవ్, కొండగొర్ల అశోక్, రత్నం నవీన్, బొడ్డు పోచయ్య, రుకం సతీష్, ఇందూరి రవీందర్, ఇందూరి శ్రీనివాస్, బొడ్డు గంగయ్య, కర్నే తిరుపతి, గంధం శంకర్, గంధం శ్రీకాంత్, మేకల బాపు, దోకే భీమయ్య, పెరుగు శ్రీనివాస్, దొంగిరే బాబు రావు, కుందారం సుమన్, అంగల సుమన్ పాల్గొన్నారు.



పారిశుధ్యం, నర్సరీల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ నాయక్



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు, నర్సరీల నిర్వాహణ, పల్లె ప్రకృతి వనాల నిర్వాహన పకడ్బందీగా చేపట్టాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ నాయక్ ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌కు ఎంపికైన కానుకూరు గ్రామాన్ని గురువారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతి పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీ, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్‌ను తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని, నివాస ప్రాంతాలు, అంతర్గత రహదారులు, రోడ్లకు ఇరువైపులా పారిశుద్ధ్యపు పనులు చేపట్టాలని సూచించారు. ముగురు కాలువలలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని, ప్రతి రోజు సేకరించిన తడిపొడి చెత్తను డంపుయార్డుకు తరలించి ఉపయోగకరమైన తడి చెత్త ద్వార కాంపోస్టు ఎరువు తయారు చేసి నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలలో మొక్కలకు వాడాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రజలకు అవగాహణ కల్పించాలని తెలిపారు. నర్సరీలలో మొక్కల పెంపకం సమర్థవంతంగా చేపట్టాలని, తెలంగాణకు హరితహారం కార్యమం లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. పల్లె ప్రకృతి వనాలలో మొక్కలకు సకాలంలో నీరు అందించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటించి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, ఈజీఎస్ ఏఈపో బాలయ్య, కానుకూరు సర్పంచ్ వెంకటేశ్వర్‌గౌడ్, పంచాయతి కార్యదర్శి సురేంద్ పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలంలోని ఎల్లక్క పేట గ్రామంలో గురువారం డీసీఎంఎస్ వరి కొనుగోలు కేంద్రాన్ని జడ్పీటీసీ మోతె తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పండిన వరి ధాన్యాలు కొనుగోలు కేంద్రంలో మాత్రమే విక్రయించాలని అన్నారు. రైతులు దళారుల మాటలు నమ్మి దళారులకు అమ్మకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, సర్పంచ్ బుర్ర రాకేష్‌గౌడ్, ఎంపీటీసీ నగావత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశు వైద్య శాల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రశు వైద్య శాలను గురువారం పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ వై.రమేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో ఉన్న రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రెండవ విడత గొర్రెల పంపిణీ వివరాలను మండల పశువైద్యాధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్ ను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో గొర్రెల పంపిణీ, రైతుల ఎంపిక ప్రక్రియను పూర్తి చయాలని సూచించారు. పశువులు గొర్రెలు మేకలు వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ శ్రీకాంత్‌కు వివరించారు.

వాహనాల భద్రతపై అవగాహన



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సేఫ్టీ జీఎం గురువయ్య ఆదేశాలమేరకు బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్కే ఓసీపీ గనిపై వాహనాల భద్రతపై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ఓపెన్ కాస్ట్ మైన్స్ లో లైట్ మోటారు వాహనాలు వాటి కదలిక (ఎల్ఎంవీ /ఎంయూవీ)లు ఉద్యోగుల రవాణా కోసం ఇతర వాహనాలపై భద్రత అవగాహన పక్షోత్సవాలను సింగరేణి వ్యాప్త అన్ని ఓపెన్ కాస్ట్ గనులలో ఈ నెల 17 నుండి 31 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గడిచిన పది సంవత్సరాలలో 64 మరణాలు సంభవించడం జరిగిందని, అందులో 30 ఓపెన్ కాస్ట్ గనులలో జరిగాయని అన్నారు. సింగరేణి ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ఎస్ఓపీలు చదువుతూ ఆపరేటర్లు డ్రైవర్లు అప్రమత్తంగా పనిచేస్తూ డ్రైవింగ్ చేయాలని కోరారు. అలాగే డ్రైవింగ్ చేస్తున్నప్పుడు పరధ్యానంలో ఉండరాదని, భారీ వాహనాలు నడుస్తున్నప్పుడు వాటి సమీపంలో ఉండరాదని సూచించారు. ఓపెన్ కాస్ట్‌లలో ప్రత్యేకమైన హాల్ రోడ్డు తయారు చేసుకుని వాహనాలు నడపడం వలన ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కే ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.గోవిందరావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ ఆంజనేయులు, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీ రాజ్ కుమార్, డీజీఎం సేఫ్టీ ఈఎం (ఐఎస్ ఓ) రామానందం, సిమ్ టార్స్ ఎస్ఓఎం, జీవీఎస్ విజయకుమార్, ఆర్కే ఓసీపీ ఇన్‌ఛార్జి మేనేజర్ రామరాజు, ప్రాజెక్ట్ ఇంజనీర్ పి.మహేందర్, సంక్షేమ అధికారి వంశీ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 19 మే 2023

గిరిజనుల విద్యకు ప్రభుత్వం పెద్ద పీట

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



గిరిజనుల విద్యకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని మెండపల్లి రెసిడెన్షియల్ గురుకుల కళాశాలలో అదనపు తరగతుల భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో గురుకుల విద్యాసంస్థకు అధిక నిధులను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం కేజీ టూ పీజీ ఉచిత విద్యా అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఇప్పపువ్వు లడ్డూ తయారీకి ముందుకు రావాలి

నవతెలంగాణ-బోథ్



గిరిజన ఆదివాసులు ఇప్పపువ్వు లడ్డూ తయారికి ముందుకు రావాలని అటవీశాఖ అధికారులు ప్రమోద్, సుందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక అటవీశాఖ కార్యాలయంలో పరిధిలోని గొల్లాపూర్ గిరిజన మహిళలకు ఇప్పపువ్వు లడ్డూ తయారీపై అవగాహన సదస్సును నిర్వహించారు. అలాగే ప్రతి గిరిజన ఆదివాసీ గ్రామాలలో ఇప్పపువ్వు లడ్డూ తయారీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగె ఇప్పపువ్వు లడ్డూలు తయారి మార్కెట్‌లను స్వతహాగా చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సురేందర్ యాదవ్, అటవీశాఖ అధికారులు ప్రమోద్, సుందర్, నాగరావు పాల్గొన్నారు.

స్వర్ణ ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్ వరుణ్‌రెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని స్వర్ణ ప్రాజెక్టును గురువారం జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి సందర్శించి, స్వర్ణ ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వలను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు సామర్థ్యం నీటి కాల్వలు, నీటిపారుదల ఆయకట్టు వివరాలను ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామారావును అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు గేట్లు, కాల్వల మరమ్మతులు ఉంటే వర్షాలు కురువకముందే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఏఈ దేవేందర్ తహసీల్దార్ సంతోష్‌రెడ్డి ఆర్ఐ ముంతాజ్‌లు ఉన్నారు.

మంత్రిని కలిసిన ఆలయ ఈఓ, ఇంజనీరింగ్ అధికారులు



నవతెలంగాణ-బాసర

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో గురువారం ఆలయ ఈఓ విజయరామారావు, ఇంజనీరింగ్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనుల విషయమై మంత్రితో ఆలయ ఈఓ, స్థాపతి, ఇంజనీరింగ్ అధికారులు చర్చించారు. బాసర ఆలయ పునర్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు మంత్రి హామీ ఇచ్చినట్లు ఆలయ ఈఓ విజయ రామారావు తెలిపారు. కార్యక్రమంలో స్థాపతి, వల్లి, నాయగాం, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు సరికావు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీజేపీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి రాళ్లబండి మహేందర్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో ఆధిపత్య ధోరణి అవలంబిస్తూ, తమ నాయకులపై దాడులకు పాల్పడుతున్న వైస్ చైర్మెన్ జహీర్ రంజానిని పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. తమ నాయకుడు మహేందర్‌పై అసత్య ఆరోపణ చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అక్రమాలతో కోట్లకు పడగలెత్తిన జహీర్ రంజాన్‌తో చెప్పించుకునే స్థితిలో బీజేపీ నాయకులు లేరని ధ్వజమెత్తారు. త్వరలోనే అతని అక్రమాలను ప్రజల ముందు ఉంచుతామని అన్నారు. గతంలో రంజాన్ సోదరులు చేసిన చీకటి వ్యాపారం అందరికీ తెలుసునని ఎమ్మెల్యే అండదండలతో నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఇంకోసారి బీజేపీ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో భారతీయ యువమోర్చా నాయకులు సాయి, రాకేష్, గోపి, నిఖిల్ ఉన్నారు.

సేమ్స్ ఒలింపియాడ్‌లో తవక్కల్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-రామకష్టాపూర్

గత సంవత్సరం సేమ్స్ ఒలింపియాడ్ వారు జాతీయస్థాయిలో నిర్వహించిన ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో తవక్కల్ విద్యార్థు జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని ఆ విద్యా సంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. గురువారం తవక్కల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణంలో గల తవక్కల్ ఇంగ్లీష్ మీడియం లో 4వ తరగతి చదువుతున్న మోతె శ్రీతీర్థ జాతీయస్థాయిలో మొదటి ర్యాంక్ తవక్కల్ హై స్కూల్ మెయిన్ బ్రాంచ్‌లో 7వ తరగతి చదువుతున్న వి.మల్లికా జాతీయస్థాయిలో మూడవ ర్యాంక్, 10వ తరగతి చదువుతున్న శహనవాజ్ అజీజ్ జాతీయస్థాయిలో 4వ ర్యాంక్, రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్, 4వ తరగతి చదువుతున్న యస్.సాయిరిశిక్ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్, 7వ తరగతి చదువుతున్న ఏ.సాహిత్ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్, 4వ తరగతి చదువుతున్న కె.కతికా రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్, 5వ తరగతి చదువుతున్న కె.అక్షత్ రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంక్, 8వ తరగతి చదువుతున్న ప్రతాప్ నాయుడు రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంక్, 10వ తరగతి చదువుతున్న టి.అమ్రిత్ చరణ్ రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంక్ మందమర్రిలోని తవక్కల్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న ఆర్.రిశ్విథ్ రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంక్ సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వచ్చే జూన్ నెలలో హైద్రాబాద్‌లో విద్యాశాఖమంత్రి సబీతా ఇంద్రా రెడ్డి చేతుల మీదుగా నగదు పురస్కారాలు, పథకాలు అందచేయ బడుతాయని తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తాం

- మండుటెండలో ఐకేపీ వీఓఏల మానవహారం



నవతెలంగాణ-భైంసా

ప్రభుత్వం ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించకుంటే త్వరలో అసెంబ్లీని ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. గురువారం ఐకేపీ వీఓఏలతో కలిసి తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ మానవహారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నెల రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం దిగిరాకపోవడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ వీఓఏల సమస్య పరిష్కరించాలని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఓఏలను సీసీలుగా ప్రమోట్ చేసి, సెర్ప్ నుండి ఐడెంటి కార్డులు ఇవ్వాలని అన్నారు. అనంతరం ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు జయశీల మాట్లాడుతూ నెలకు రూ.3వేల 900ల వేతనంతో పని చేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించకపోవడం శోచనీయమని అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో తాము తోడుంటామని అన్నారు. పది సంవత్సరాలుగా మహిళా సంఘాల అర్థికాభివృద్ధికి పాటుపడుతున్నామని అన్నారు. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఓఏలను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18వేల మంది సమ్మె చేస్తున్నారని అన్నారు. దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈనెల 18న వీఓఏల కింద రాత్రి బస కార్యక్రమాలు, 22 నాడు చలో కలెక్టరేట్ ధర్నా, 29 నాడు సెర్ప్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం ఉంటుందని అన్నారు. అంతకుముందు నియోజకవర్గంలోని వీఓఏలందరూ భైంసా ఎంపీడీఓ కార్యాలయం చేరుకొని ర్యాలీగా నిర్మల్ చౌరస్తాకు వచ్చారు. అనంతరం గంటపాటు మానవహారాన్ని చేపట్టడంతో ఎక్కడికి అక్కడే వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా కార్యదర్శి సాయన్న, జిల్లా ఉపాధ్యక్షులు సంపత్, మహేష్, సాయిబాబా, రమేష్, రాజు, పోతన్న, లక్ష్మణ్, మోహన్, జీవన్ పాల్గొన్నారు.





డీలర్లు, కంపెనీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

జిల్లాలోని ముఖ్యమైన విత్తన, ఎరువుల డీలర్లు, కంపెనీ ప్రతినిధులతో జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య డీఏఓ కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో వివిధ పంటల విత్తనాలు, నిల్వలు, సరఫరా, అమ్మకం, ఎరువుల నిల్వలు వాటి సరఫరా, అమ్మకం గురించి పలు సూచనలు చేశారు. విత్తన, డీలరు అమ్మే విత్తన కంపెనీకి సంబంధించిన లైసెన్సు గడువు, రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం, అనుమతి ఉందా లేదా అని సరిచూసి అట్టి కాపీని ప్రిన్సిపల్ సర్టిఫికెట్‌ను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. విత్తన నిల్వలను గాలి, వెలుతురు పుష్కలంగా ఉండే గోడౌన్లలో పొందుపరచుకొని తమ లైసెన్సు, బోర్డుతో పాటు ఉండేటట్లు చూసుకోవాలని అన్నారు. విత్తనం రైతుకు అమ్మేటప్పుడు బిల్లునందు లాట్ నెంబర్, గడువు ధర వివరాలు రైతు సంతకంతో ఇవ్వాలని సూచించారు. విత్తన స్టాకు వివరాలు, స్టాక్ బోర్డు పైన ప్రతిరోజు నమోదు చేయాలని అన్నారు. ప్రతినెల డి ఫామ్ రూపంలో పంటల వారీగా నిల్వలు, అమ్మకం వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని పేర్కొన్నారు. ఎరువులు, విత్తనాలు పట్టాదారు పాసు పుస్తకం చూసి విస్తీర్ణం ప్రకారం పట్టాదారు పేరుతో అమ్మాలని ఆదేశించారు. ఎరువులు, విత్తనాలను ఒకే చోట నిల్వ ఉంచకుండా వేరువేరుగా నిలువ చేయాలని తెలిపారు. ఎరువుల డీలర్లు తమ లైసెన్స్‌ను కంపెనీలకు సంబంధించిన గోడౌన్లలో తప్పకుండా అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఎరువులను ఎటువంటి లింకులు లేకుండా ఎమ్మార్పీ ధర దాటకుండా అమ్మాలని సూచించారు. ఎరువుల డీలర్లు తమ ఎం ఫామ్స్, ఐడిలో స్టాక్ వివరాలను, గోడౌన్‌లో స్టాక్ వివరాలను ఎటువంటి తేడా లేకుండా ఉంచాలని అన్నారు. ఎస్ ఫార్మ్ ఐడిలో క్రమం తప్పకుండా వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మండల వ్యవసాయ అధికారి భగత్ రమేష్, టెక్నికల్ వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆదిలాబాద్, ఇచ్చోడ, బోథ్, అగ్రి ఇన్పుట్ డీలర్లు, వివిధ ఎరువుల, విత్తనాల కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారులన్నీ సీసీటీవీ కెమెరాల నిఘాలోనే ఉండాలి

- లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి
- ఆదిలాబాద్ ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన నెల వారి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌ల అధికారులు, సర్కిల్ అధికారులు, సబ్ డివిజన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రతి ఒక్క గ్రామాన్ని ప్రతివారం స్థానిక ఎస్‌హెచ్ లేదా సర్కిల్ అధికారి లేదా సబ్ డివిజన్ అధికారి సందర్శిస్తూ ఉండాలని అన్నారు. జిల్లాలోని జాతీయ రహదారి అంతా సీసీటీవీ నిఘాలో వచ్చే విధంగా ప్రధానమైన కూడళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటూ వాటిని పూర్తిస్థాయిలో నిరోధించేలా కృషి చేయాలని తెలిపారు. వచ్చే నెల పదో తారీఖున నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సమిష్టిగా కృషిచేసి విజయవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా పట్టణంలో దొంగలను పట్టుకున్న పట్టణ పోలీసులకు నగదు రివార్డును అందజేసి అభినందించారు. గత నెలలో వివిధ వర్టికల్స్ నందు ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేసీ భవిష్యత్తులో ఇదేవిధంగా ప్రతిభ కనబరిచిన ప్రతి ఒక్కరికి తగిన ప్రతిఫలం లభిస్తుందని తెలిపారు. అనంతరం జిల్లాలో గత నెలలో జరిగిన నేరాలపై పెండింగ్‌లో ఉన్న కేసులపై పూర్తి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ద వేడుకలను సమిష్టిగా ఘనంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. దశాబ్ది ఉత్సవాలలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఎస్పీలు వి.ఉమేందర్ సీహెచ్ నాగేందర్, పి. శ్రీనివాస్ పాల్గొన్నారు.



పరీక్షలతో కంటి చూపు మెరుగు



నవ తెలంగాణ-సారంగాపూర్

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని కంటి చూపు మెరుగు పర్చుకోవాలని ఎంపీపీ మహిపాల్ రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వైకుంఠపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ సర్పంచ్ చిన్నయ్యతో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని అంధత్వ నివారణ రాష్ట్రంగా ఏర్పాటు చేసేందుకు సీఎం కేసీఆర్ ఉచిత కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ప్రతి ఒక్కరూ కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చందు, వైద్యులు, ఎఎన్ఎంలు ఆశలు, అంగన్‌వాడీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

లంపీస్కిన్ వైరస్ నివారణకు చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అన్నదాతకు ఆరుగాలం అండగా ఉండే ఎద్దులు ఇతర మూగజీవాలను వేధిస్తున్న లంపీస్కిన్ వైరస్‌ను నివారించి, రైతులను ఆదుకోవాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రుపేష్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పశువైద్యాధికారి కిషన్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర సరిహద్దు దగ్గర ఉన్నందున ఆదిలాబాద్ జిల్లాలోని బేల మండలంలో లంపీస్కిన్ వైరస్ ప్రభావం అధికంగా ఉందని అన్నారు. దీనివల్ల వేల రూపాయలు వెచ్చించి, కొనుగోలు చేసి సాగుకు సహకరించే ఎద్దులు లంపీస్కిన్ వైరస్ బారిన పడి మృతి చెందుతున్నాయని అన్నారు. దీంతో అన్నదాత చేయి విరిగిన పరిస్థితి అవుతుందని అన్నారు. ఈ వైరస్ నివారణకు ఇప్పటికే పదుల సంఖ్యలో ఎద్దులు, ఆవులు, ఇతర పశువులు మృతి చెందినట్లు రైతులు తెలుపుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో ఈ వైరస్ మరింత విస్తరించకుండా మూగజీవాలు మృతి చెందకుండా క్యాంపులు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. అయితే సానుకూలంగా స్పందించిన పశు వైద్యాధికారి రేపటినుండి క్యాంపులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా పశువైద్యాధికారిని కలిసిన వారిలో ఐఎన్టీయూసీ బేల మండల అధ్యక్షుడు ఎండీ అఖిల్, బేల మండలం ఎస్టీ సెల్ అధ్యక్షుడు మడవి చంద్రకాంత్, అజారుద్దీన్, మారుతి ఉన్నారు.

29న మాదిగ సంక్షేమ సంఘం భవన నిర్మాణ భూమిపూజ

- జిల్లా అధ్యక్షుడు చందాల రాజన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మే29న నిర్వహించే మాదిగ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్టు, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చందాల రాజన్న అన్నారు. గురువారం మావల మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించారు. జందాపూర్, రాంపూర్, పొచ్చర, అంకోలి, బట్టిసవర్గాం, దుబ్బ కాలనీలో మాదిగ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29న మాదిగ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్టు తెలిపారు. అలాగే మావల, జైనథ్, బేల, భీంపూర్, తాంసి, తలమడుగు మండలాల కేంద్రాల్లోని ఆయా గ్రామాల్లో మాదిగలు అధిక సంఖ్యలో వచ్చి భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాదిగ సమాజాన్ని చైతన్యవంతం చేయడం కోసం ప్రతి ఒక్క మాదిగ బిడ్డ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బిక్కి గంగాధర్, ఏవన్, కడదరపు అశోక్, మార్కెట్ డైరెక్టర్ గంగాధర్, ప్రభాకర్, దర్శనాల అశోక్, ఉషన్న, బండారి అశోక్, కొత్తూరు రాములు, వార్డ్ మెంబర్ అక్కినపల్లి లక్ష్మి, సుశీల, పొచ్చక్క, భాగిర్థ, ఆశమ్మ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో కంటి వెలుగు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. డాక్టర్ ప్రీతల్ రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కంటి వెలుగు కార్యక్రమం వారం రోజులల పాటు సాగనుంది. ఇందులో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జలగం అనిత, ఆధ్యాపకులు, విద్యార్థులు దాదాపు 500 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. దృష్టి లోపం ఉన్నవారు అద్దాలు పొందారు.